# మాంద్యం దిశగా పరుగెడుతున్న గ్లోబల్ ఆర్థిక వ్యవస్థ

**ప్రస్తుతం** ప్రపంచ ఆర్థిక మాంద్యం తీవ్రస్థాయిలో వున్నది. ఇది హటాత్తుగా ఏర్పడలేదు. 2008 ద్రవ్య సంక్షోభం నుండి గ్లోబల్ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా కోలుకోనే లేదు. సమస్త దేశాలలో నిలకడగా బలపడుతున్న ఆర్థిక సంక్షోభం, కోవిడ్ విపత్తు వల్ల వికృతంగా బయటపడిందని ప్రపంచ అసమానతల నివేదిక-2022 చెబుతున్నది. ఈ ప్రమాదం గురించి ఐక్యరాజ్యసమితి, ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు మొదలగు ప్రపంచ ఆర్థిక సంస్థలు ఆందోళన పడుతున్నాయి. భవిష్యత్తు ధోరణుల గురించి అంచనాలు వేస్తున్నాయి. వెనువెంటనే సవరిస్తున్నాయి. ప్రతీ సవరణలో రాబోయే సంవత్సరాలలో పతనం తీవ్రత పెరుగు తుందనే అంశాన్నే అంచనాల గణాంకాలు చెబుతున్నాయి. ప్రపంచ దేశాలన్నీ ఈ సంక్షోభాన్ని సమిష్టిగా, సంఘటితంగా ఎదుర్కోవాలని పదే పదే సూచిస్తున్నాయి.

నిరుద్యోగ సంక్షోభం ఒకవైపు, విపరీతమైన ధరల పెరుగుదల మరొకవైపు మెజారిటీ ప్రజల జీవితాలను దుర్భరం చేస్తున్నాయి. దీనికి వస్తువుల సరఫరా తగ్గటం, ధరల పెరుగుదలలు కారణం కాదు. ఎందుకంటే నిత్యావసర వస్తువుల నిల్వలు పెరుగుతూనే వున్నాయి. ఇదొక వైరుధ్యం. ధరల పెరుగుదల, లాభం రేటు తగ్గుదల సమాంతరంగా కొనసాగటం మరొక వైరుధ్యం. దీనినే స్తబ్దతతో కూడిన ద్రవ్యోల్బణం (stagflation) అంటారు. దోచుకున్న నిరపేక్ష, సాపేక్ష మిగులు విలువ లాభంగా రూపొందాలంటే ఉత్పత్తి చేసిన వస్తువులను విక్రయించాలి. అందుకు ప్రజలకు కొనుగోలు శక్తి వుండాలి. అంటే సంపాదన వుండాలి. ఉత్పత్తి చేసిన వస్తువులను విక్రయించలేని సంక్షోభాన్ని మార్క్స్ అల్ప వినియోగ సంక్షోభం (Crisis of Under consumption) అంటాడు. ఇది లాభం రేటు తగ్గుదల సంక్షోభానికి (the crisis of falling rate of profit) దారితీస్తుంది. దీనివల్ల అసంఖ్యాకమైన నిరుద్యోగ రిజర్వు సైన్యం ఒకవైపు తీవ్రం అవుతుంది. మరొకవైపు విక్రయించని వస్తు నిల్వల రాశులు అపారంగా పోగుపడతాయి. సంక్లిష్టమైన సంక్షోభ స్థితిలో వున్న ఉత్పత్తి విధానానికి మనుగడ వుండదు. అందువల్లనే అంతర్జాతీయ సంస్థలు, ప్రపంచ ఆర్థిక మాంద్యం గురించి మళ్ళీ మళ్ళీ అంచనాలు వేస్తున్నాయి, సవరిస్తున్నాయి. పతనాన్ని సూచిస్తున్న అంచనాలను చూసి ఆందోళన పడుతున్నాయి.

ఈ సందర్భంగా సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్, పతనాన్ని సూచిస్తున్న ప్రపంచ ఆర్థిక మాంద్యం అంచనాలకు ప్రతిస్పందనగా "దేశాల నడుమ, దేశాలలో అసమానత్వ అంతరాలను తొలగించటానికి సమయమిదే. మనమంతా సంఘీభావంగా ఒకే మానవ కుటుంబంగా కృషిచేస్తే, ప్రజలు, ఆర్థిక వ్యవస్థలు ఒకేలా కోలుకునే నిజమైన సంవత్సరంగా 2022ను మనం మలుచుకోగలం" అని ప్రకటించాడు.

**ప్రపంచ ఆర్థిక మాంద్యం-అంచనాలు :**

ఐఎంఎఫ్ అంచనాల ప్రకారం 2020 లోనే గ్లోబల్ ఆర్థిక వ్యవస్థ వృద్ధిరేటులో క్షీణత స్థిరపడింది. ప్రపంచంలో నిరుద్యోగిత తీవ్రమైంది. అమెరికాలో నిరుద్యోగిత అత్యధిక స్థాయిలో నమోదయింది. లాభం రేటు పడిపోవటం వల్ల బంగారానికి ప్రాధాన్యతనివ్వటం పెరిగింది. గ్లోబల్ ఉత్పత్తి వృద్ధిరేటు 2021లో 6.1 శాతం వుండగా, అది 2022లో 3.2 శాతానికి, 2023లో 2.9 శాతానికి పడిపోయింది; 2024లో 2.8 శాతానికి పడిపోతున్నది. కాగా, వృద్ధిరేటు పతనం తీవ్రత సంపన్న దేశాలలో అధికంగా వుంది. 2021లో 5.2 శాతం నుండి 2022లో 2.5 శాతానికి, 2023లో 1.4 శాతానికి వృద్ధిరేటు తగ్గింది. కాగా వర్ధమాన దేశాలలో 2021లో 6.8 శాతం వృద్ధిరేటు నుండి 2022లో 3.6 శాతానికి, 2023లో అదే స్థాయిలో కొనసాగుతోంది. వృద్ధిరేటు క్షీణత అధికంగా వున్న సంపన్న దేశాలు, ద్రవ్యోల్బణ స్థాయిలో మెరుగ్గా వుంటున్నాయి. వర్ధమాన దేశాలలో ద్రవ్యోల్బణ సమస్య తీవ్రంగా వుంటోంది.

గ్లోబల్ స్థూల దేశీయోత్పత్తిలో వస్తు వాణిజ్యం వాటా, ప్రత్యేకించి 2008 నుండి క్రమంగా తగ్గుతున్నది. వెనుకబడిన దేశాలు, విదేశీ రుణ వలయంలో చిక్కుకుంటున్నాయి. ఐఎంఎఫ్ అంచనాల ప్రకారమే 30 శాతం వర్ధమాన దేశాలు, 60 శాతం వెనుకబడిన దేశాలు విదేశీ రుణంలో అత్యధిక స్థాయి రిస్క్ వున్న దేశాలుగా వున్నాయి. 'సెంటర్ ఫర్ ఎకనామిక్స్ అండ్ బిజినెస్ రీసెర్చ్' రూపొందించిన గ్లోబల్ మాంద్యం-2023 అంచనాలు, ఐఎంఎఫ్ అంచనాల కంటే నిరాశాజనకంగా వున్నాయి. 2023 నాటికి గ్లోబల్ స్థూల దేశీయోత్పత్తిలో వృద్ధిరేటు 2 శాతం కన్నా తక్కువగా వుంది.

ఐక్యరాజ్యసమితి రూపొందించిన ప్రపంచ ఆర్థిక అవకాశాల పరిస్థితి నివేదికలు కూడా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వృద్ధిరేటులో సంక్లిష్టతనే చెబుతున్నాయి. తగ్గేదే లేదని మొరాయిస్తున్న ధరల పెరుగుదల గురించి, సంపన్న దేశాలలో పెరుగుతున్న వడ్డీ రేట్లు, వాటి ప్రభావాల గురించి వివరిస్తున్నాయి. 2024 జనవరిలో రూపొందించిన వరల్డ్ బ్యాంకు గ్రూప్ ఫ్లాగ్ షిప్ నివేదిక-2024లో కూడా గ్లోబల్ వృద్ధిరేటు ఇంకా పతనమవు తుందని, 2025లో మాత్రం 2.7 శాతానికి పెరుగుతుందని చెబుతోంది. వర్ధమాన దేశాల్లో పెట్టుబడులు తగ్గుతూనే ఉంటాయని, వస్తువుల ఎగుమతులలో అస్థిరత తీవ్రంగా ఉంటుందని చెబుతున్నది. దీనివల్ల వడ్డీరేట్ల పెరుగుదల, కొనసాగుతున్న తీవ్రమైన ద్రవ్యోల్బణం ప్రమాదకరంగా ఉండబోతున్నాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలు, తమ ఆర్థిక సామర్థ్యాన్ని పూర్తిగా

వినియోగించుకోవటానికి విద్య, వైద్యాన్ని ప్రజలకు అందుబాటులోకి తేవాలని, శ్రామికుల భాగస్వామ్య రేటును పెంచాలని ఈ నివేదిక చెబుతోంది. ప్రపంచ ఆర్థిక అవకాశాల పరిస్థితి-2024 ప్రకారం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ బహుముఖ సంక్షోభాలను ఎదుర్కొంటున్నది. అందువల్ల 2023-24లో కూడా గ్లోబల్ స్థూల దేశీయోత్పత్తిలో వృద్ధిరేటు తగ్గుతూనే వుంటుంది. ఇక వర్ధమాన దేశాలు అధిక విదేశీ రుణభారంతో, తగ్గుతున్న పెట్టుబడులతో, సంక్లిష్టమైన ధరల పెరుగుదలతో సతమత మవుతాయి. అన్ని దేశాల నుంచి మూలధనం ఎగిరిపోతుంది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు తగ్గిపోతాయి.

ఈ సమస్యల వలన 2030లో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన (SDGs) అసాధ్యమవుతుంది. 2015 నాటికి సాధిస్తామని 2000 సం॥లో UNO ప్రకటించిన మిలీనియం అభివృద్ధి లక్ష్యాలను సాధించలేదు. ఈ లక్ష్యాలనే కొద్ది మార్పులతో 2030లో సాధించవలసిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలుగా ప్రకటించారు. అది కూడా అసాధ్యమే. పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థ అభివృద్ధి క్రమం మెజారిటీ ప్రజలకు దుర్భరమైన జీవితాలనే గ్యారంటీగా చేస్తోంది. ప్రస్తుత ఆర్థిక మాంద్యానికి రష్యా - ఉక్రెయిన్ యుద్ధం, పర్యావరణ విధ్వంసం, వాతావరణ మార్పు వల్ల ఏర్పడుతున్న సంఘటనలు, పెరుగుతున్న చమురు ధరలను కారణాలుగా చెబుతున్నారు. కానీ లాభాపేక్ష, పెత్తనం కోసం ఆధిపత్య దేశాల, ఆధిపత్య వర్గాల రాజకీయ ఆర్థిక పోరు మొదలైనవన్నీ ఈ సమస్యలకు కారణాలు. కాగా, పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థ వల్ల ఏర్పడిన సమస్యలను, ఆర్థిక మాంద్యానికి కారణాలని చెప్పటం అశాస్త్రీయమే. స్తబ్దతతో వున్న వ్యవస్థలో పెట్టుబడుల యజమానులకు లాభాలు ఎట్లా వస్తున్నాయి? వాస్తవ ఆర్థిక వ్యవస్థకు సంబంధం లేని ఊహాగానాలు, అవకాశాలను దోచుకోవటం, సమస్త మానవ, సామాజిక సంబంధాలలోని నైతిక పునాదులను విచ్ఛిన్నం చేయటం, ప్రభుత్వ నియంత్రణలో వున్న దేశ సంపదను లూటీ చేయటం, హద్దులులేని అవినీతి, లంచగొండితనం అనేవి ఈ స్తబ్దతలోనూ యజమానులకు లాభాలనందిస్తున్నాయి. పిడికెడు మందిగావున్న వీరు విఫలతలో అధికంగా వున్నప్పటికీ, ఆర్థిక పరిణామాల తీవ్రతరీత్యా దివాలా తీయటానికి ప్రభుత్వం వీరిని అనుమతించదు. కార్పొరేట్ శక్తుల ఖజానా, భద్రంగా ఉండ టానికి ఈ వ్యవస్థని భద్రతా స్థావరాలను సృష్టించింది.

గత మూడు దశాబ్దాలుగా బలంగా అమలవుతున్న నయా ఉదారవాద విధానాల వల్ల ఆర్థిక అసమానతలు అనూహ్యంగా పెరిగాయి. ఆదాయం, సంపద-రెండూ శ్రామిక వర్గం నుండి పెట్టుబడిదారీ వర్గానికి బదిలీ అయింది. ఉపాంత వినియోగ ప్రవృత్తి అధికంగా ఉండే పీడిత వర్గం నుండి ఉపాంత వినియోగ ప్రవృత్తి స్వల్పంగా ఉండే సంపన్న వర్గానికి ఆదాయ, సంపదలు బదిలీ కావటం వల్ల అల్ప వినియోగ సంక్షోభం ఏర్పడుతుంది కదా! సంపన్న వర్గం మాత్రమే వినియోగించే సూపర్ విలాస వస్తువుల ఉత్పత్తితో ఆర్థిక వ్యవస్థ నిలబడగలుగుతుందా?

**పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థ - సంక్షోభం :**

స్వేచ్ఛగా వ్యవహరిస్తున్న మార్కెట్ శక్తుల పునాదిగా నడిచే పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థ అభివృద్ధి క్రమం సంక్షోభాలతో బలంగా ముడిపడి వుంటుందని గత 100 సంవత్సరాల గ్లోబల్ ఆర్థిక వ్యవస్థ, 1930 ప్రపంచ ఆర్థిక మాంద్యం నుండి నిరూపిస్తూనే వున్నది. సంక్షోభాల నుండి వ్యవస్థను సరిదిద్దటానికి నిర్వచనమైన ప్రభుత్వమే చొరవ, చర్యలు తీసుకోవటం సీరియస్ వైరుధ్యమే. తగ్గుతున్న లాభం రేటు వల్ల సంక్షోభాలు ఏర్పడతాయి.

అందువల్ల కోలుకునే క్రమం, లాభం రేటును పెంచడంతో ముడిపడి వుంటుంది. సంక్షోభం తర్వాత పెట్టుబడిదారీ దోపిడీ వర్గం బలపడుతుంది. శ్రామిక వర్గం బలహీనమవుతుంది. దోపిడీ తీవ్రత పెరుగుతుంది.

దేశ సరిహద్దులకు అతీతంగా ఆధిపత్యాన్ని, దోపిడీని విస్తరించే సామ్రాజ్యవాద దోపిడీ శక్తులు బలపడతాయి. ఈ క్రమం గతంలో అసమ వాణిజ్యం (Unequal trade), మూలధన ఎగుమతుల (Export of Capital) రూపంలో వున్నాయి. వీటికి అదనంగా 21వ శతాబ్దిలో 'గ్లోబల్ విలువ గొలుసు' (జివిసి) అత్యంత అధిక ఆదాయాన్ని సంపాదించే సాధనంగా రూపొందింది. సూపర్ లాభాలను పొందటం సులభమైంది. ఇందుకు పెట్టుబడులను ఎగుమతి చేయవలసిన అవసరం లేదు.

విలువ గొలుసును సమర్థవంతంగా వేరువేరు పనులుగా విభజిస్తారు. ఇందులో అత్యంత విలువగల భాగం - డిజైన్, రిటైల్ వాణిజ్యం - హెడ్ క్వార్టర్ దేశాలలో కార్పొరేట్ శక్తుల అధీనంలో వుంటుంది. తక్కువ విలువ గల తయారీ, అసెంబ్లింగ్ టాస్కులను వర్ధమాన/ వెనుకబడిన దేశాలకు తరలిస్తారు. ఈ దేశాలలో బలపడుతున్న అసంఘటిత రంగం వల్ల లభించే సమస్త మిగులును హెడ్ క్వార్టర్ దేశాలు గ్లోబల్ విలువ గొలుసు ద్వారా దోచుకుంటాయి. ఈ దేశాలలో లభించే చౌక శ్రమ మాత్రమే కాదు.

గత రెండు దశాబ్దాలుగా ILO హెచ్చరిస్తున్న దుర్భరమైన పని పరిస్థితులు, కూలిపోతున్న భవనాలతో, ఏ సౌకర్యాలూ లేని పరిస్థితుల్లో ఉత్పత్తి చేయటం, ప్రమాదాలు జరిగినా నష్టపరిహారం తక్కువగా ఇవ్వటం, చాలా సందర్భాలలో ఎగ్గొట్టడానికి వీలుండటం, పర్యావరణానికి సంబంధించిన చట్టాలను ఉల్లంఘించడం, శ్రామికుల భద్రత కోసం తీసుకోవాల్సిన చర్యలను పట్టించుకోకపోవడం మొదలైన వాటి వల్ల తయారీ, అసెంబ్లింగ్‌ల ద్వారా అత్యధిక మిగులు, హెడ్ క్వార్టర్ దేశాలకు లభిస్తుంది. తయారైన వస్తువుపై బ్రాండ్ పేరును ముద్రించి వర్తమాన దేశాల్లోనే అత్యధిక ధరలకు విక్రయిస్తాయి. వలసకాలంలో వలస దేశాలు, ముడిసరుకులను తక్కువ ధరకు

ఎగుమతులు చేసి, తయారైన వస్తువులను అత్యధిక ధరకు దిగుమతులు చేసుకున్న అసమ వాణిజ్యానికి ఆధునిక సామ్రాజ్యవాద దోపిడీ రూపమే గ్లోబల్ విలువ గొలుసు. దీని ద్వారా 80 శాతం పైగా ప్రపంచ వాణిజ్యం నిర్వహించ బడుతున్నదని UNCTAD నివేదిక-2013లోనే చెప్పింది. ఐఎల్ఓ-2015 నివేదిక ప్రకారం OECD, ఆసియా దేశాల్లో GVC ద్వారా 400 మిలియన్ల మందికి పైగా ఉద్యోగాలు చేస్తున్నారు. GVC అంటే పెట్టుబడి లేకుండా ఆధిపత్య శక్తులు వెనుకబడిన దేశాలను దోచుకోవటం అని UNCTAD-2013 నివేదిక స్పష్టం చేస్తోంది. సామ్రాజ్యవాద దోపిడీశక్తులు రూపొందించిన సరికొత్త సామ్రాజ్యవాద దోపిడీ సాధనాల వల్ల ఆధిపత్య దేశాల్లో అపారమైన సంపద పోగుపడుతోంది. లాభం రేటును పెంచుకునే క్రమంలో 2008 ద్రవ్య సంక్షోభం తర్వాత గిగ్ కార్మిక వ్యవస్థ రూపొందింది. దీనితో శ్రమ సరుకీకరణ పరాకాష్ట దశకు చేరుకున్నదని, శ్రమదోపిడీ శిఖర స్థాయికి చేరుకున్నదని ఐఎల్ఓ ఆవేదన వ్యక్తం చేసింది. మరొకవైపు ఆటోమేషన్, రోబోలు, కృత్రిమ మేధ వినియోగాన్ని పెంచడం ద్వారా శ్రమరహిత ఉత్పత్తి ప్రక్రియను బలపరిచే ప్రయత్నాలు సాగుతున్నాయి. కార్మిక సంఘాలు, కార్మికుల హక్కులు, పని గంటల నియమాలు అంతరించాయి. అత్యధిక నిరుద్యోగ రిజర్వు సైన్యం రూపంలో శ్రామికవర్గ ప్రపంచం సంక్లిష్టమైన సంక్షోభంలో బందీ అయింది.

పెట్టుబడి తన లాభం కోసం క్రూరమైన దోపిడీ రూపాలను సృష్టించింది. అందువల్ల అపారమైన మిగులు విలువ పోగు పడింది. ఇది లాభం రూపంలో వాస్తవీకరించబడాలి. అందుకు ప్రజలకు కొనుగోలు శక్తి కావాలి. అంటే ప్రజలందరికీ గౌరవప్రదమైన ఉపాధులు లభించాలి. అసంఖ్యాకమైన నిరుద్యోగ రిజర్వు సైన్యం ఏర్పడటం వల్ల, మార్క్స్ శాస్త్రీయంగా అంచనా వేసిన అల్ప వినియోగ సంక్షోభం పరాకాష్ట దశకు చేరుకున్నది. పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థ తన గొయ్యిని తానే సిద్ధం చేసుకున్నది. పీడితవర్గాన్ని బలంగా సంఘటిత పరచడం ద్వారా విప్లవశక్తులు ఈ దోపిడీ వ్యవస్థను గొయ్యిలో పడేయటమే మిగిలి వున్నది.

**ఆర్థిక మాంద్యం - అమెరికా :**

అమెరికాలో ధరల పెరుగుదల, నిరుద్యోగిత పెరుగుదల సమాంతరంగా తీవ్రమవుతున్నాయి. ఈ సమస్యను నియంత్రించ డానికి అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీ రేట్లను పెంచింది. పెట్టుబడులు అమెరికాను భద్రమైన దేశంగా భావిస్తాయి. కాబట్టి వర్ధమాన దేశాల నుంచి, ప్రత్యేకించి భారతదేశం నుంచి విదేశీ పెట్టుబడులు అమెరికాకు తరలి వెళ్తాయి. మన స్పెక్యులేషన్ మార్కెట్‌ను అధిక చంచలత్వం వున్న విదేశీ పోర్టుపోలియో పెట్టుబడులు శాసిస్తాయి. అవి వెంటనే వెళ్లిపోతాయి. మన స్పెక్యులేషన్ మార్కెట్ యొక్క అస్థిరత్వం ఇంకా తీవ్రమవుతుంది. అంతేకాకుండా విదేశీ సంస్థలు సులభంగా నిష్క్రమించడానికి కావలసిన చట్ట సవరణలను మన దేశం రూపొందించింది. ఎన్నో పన్ను రాయితీలు, ప్రోత్సాహకాలతో ఆకర్షించిన విదేశీ పెట్టుబడులు, అమెరికాలో పెరిగిన వడ్డీ రేట్ల వల్ల మన దేశం నుండి వెళ్లిపోతాయి.

ఈ పరిస్థితి వల్ల డాలర్ విలువ పెరుగుతుంది. అది గ్లోబల్ కరెన్సీగా కొనసాగటం వల్ల వర్ధమాన దేశాల కరెన్సీలు, ప్రత్యేకించి భారతదేశ రూపాయి విలువ తగ్గిపోతుంది. అదే స్థాయిలో విదేశీ మారకానికి మనం ఎక్కువ వస్తు పరిమాణాన్ని ఎగుమతులు చేస్తాము. భారతదేశంలో వేతనాలు ఇంకా తగ్గుతాయి. శ్రమ దోపిడీ తీవ్రమౌతుంది. ధరలు పెరుగుతాయి. అయినప్పటికీ అమెరికాలో ఆర్థిక మాంద్యం కొనసాగుతూనే వున్నది. గత మూడు దశాబ్దాల నుండి బలంగా అనుసరిస్తున్న నయా ఉదారవాద విధానాల వల్ల అమెరికాలో పారిశ్రామిక పునాది డొల్లయింది. ప్రైవేటీకరణ, వాణిజ్య సరళీకరణ వల్ల పబ్లిక్ పెట్టుబడులు తగ్గిపోయినాయి. ఫైనాన్స్ పెట్టుబడుల ఆధిపత్యం పరాకాష్టకు చేరింది. వస్తు సేవలతో కూడిన వాస్తవ ఆర్థిక వ్యవస్థ విధ్వంసం అయింది. కార్పొరేట్ శక్తుల చేతిలో సంపద కేంద్రీకరించబడింది. అమెరికా, నేషనల్ సెక్యూరిటీ ఎస్టాబ్లిష్మెంట్ ప్రకారం కార్మిక ఉద్యమాలు, కార్మిక సంఘాలు పెట్టుబడిదారీ వ్యవస్థకు రక్షణ కవచాలు. వాటిని నిర్మూలించడం సరైనది కాదంటుంది. నయా ఉదారవాద విధానాలతో కూడిన పాత వాషింగ్టన్ ఏకాభిప్రాయం స్థానంలో పబ్లిక్ రంగాన్ని బలోపేతం చేసే సమ్మిళిత అభివృద్ధికి కావలసిన విధానాలతో కొత్త వాషింగ్టన్ ఏకాభిప్రాయానికి మారటానికి నిర్ణయించుకున్నది.

**భారతదేశం - ఆర్థిక మాంద్యం :**

IMF అంచనాలు, ప్రపంచ ఆర్థిక పరిస్థితి అవకాశాలు-2024 అంచనాల ప్రకారం 2024లో కూడా భారతదేశ వృద్ధిరేట్లో తగ్గుదల ఉంటుందని, అది 6.2 శాతానికి మించదని చెబుతున్నాయి. సూపర్ పవర్ అమెరికాతో భారతదేశం బలంగా అనుసంధానమై వుండటం వల్ల అమెరికాలో పెరుగుతున్న ఆర్థిక మాంద్యం భారతదేశానికి విస్తరిస్తుందని సెంటర్ ఫర్ ఎకనామిక్స్ అండ్ బిజినెస్ రీసెర్చ్ రూపొందించిన గ్లోబల్ రెసిషన్, 2023 అంచనాలు చెబుతున్నాయి. ప్రధానంగా భారతదేశ కంపెనీలకు అమెరికా క్లైంట్లతో భారీ ఎత్తున ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్టులు వుండటం వల్ల, అమెరికాకు మన ఎగుమతులు పెరగటం వల్ల అమెరికాలో బలపడుతున్న ఆర్థిక మాంద్యం సునాయాసంగా మన దేశానికి ఎగబాకుతుంది. మన వస్తు సేవల గిరాకీ తగ్గుతుంది. విదేశీ మారక చెల్లింపుల శేషంలో, ప్రత్యేకించి కరెంట్ అకౌంట్‌లో లోటు ఇంకా తీవ్రం అవుతుంది. బ్యాంకులలో మొండి బాకీలు తీవ్రం అవుతాయి. స్టాక్ మార్కెట్లో సంక్షోభం తీవ్రం అవుతుంది.

ఇటువంటి నిరాశాజనకమైన పరిస్థితులను అంతర్జాతీయ సంస్థల అంచనాలు, భారతదేశ వృద్ధిరేటు గురించి చెబుతుంటే,

ఇటీవల కాలంలో దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సమావేశంలో మన ఆర్‌బిఐ గవర్నర్ శక్తి కాంత్ దాస్ 2025 ఆర్థిక సంవత్సరంలో భారతదేశ వృద్ధిరేటు 7 శాతం వుంటుందని, వినియోగదారుని ధరల సూచీ 4.5 శాతానికి తగ్గుతుందని ప్రకటించడం సీరియస్ వైరుధ్యమే. ఆర్థిక సర్వే 2018-19 ప్రకారం 2012-17ల మధ్యకాలంలో ప్రైవేటు పెట్టుబడులు తగ్గాయి. వృద్ధిరేటు మందగించింది. వాణిజ్య సౌలభ్యం కోసం తీసుకున్న చర్యల వల్ల 2014లో వాణిజ్య సౌలభ్య సూచీలో 142 వున్నది. ఇది 2018 నాటికి 77కు ఎదిగింది. వాణిజ్యానికి అనుకూల పరిస్థితులను ఏర్పరిచినప్పటికీ, తక్కువ వడ్డీ రేటుకు రుణాలు లభించినప్పటికీ ప్రైవేటు పెట్టుబడులు పెరగలేదు. 2019 నాటికి ఆర్థిక మాంద్యం బలపడింది. నిరుద్యోగిత పెరుగుతూనే వున్నది. సమాంతరంగా ధరల పెరుగుదల తీవ్రంగా వున్నది. ఆహార నిల్వలు గోడౌన్లలో పెరుగుతూనే వున్నాయి. వినియోగ వస్తు ధరల సూచీ పెరుగుతూనే వుండటం వైరుధ్యం. బ్యాంకులలో ద్రవ్యత్వం అధికంగా వుంది. ఇది సరఫరా సమస్య కాదు. సమిష్టి డిమాండ్ సంక్షోభం.

1990-91లో మొదలైన నయా ఉదారవాద విధానాలతో మొట్టమొదట ప్రాథమిక అవసరాలైన విద్య, వైద్యాన్ని ప్రైవేటీకరించారు. దీనివల్ల ఇవి సామాన్య ప్రజలకు అందుబాటులోకి రావు. ప్రభుత్వ రంగ సంస్థల పెట్టుబడుల ఉపసంహరణతో మొదలై ప్రభుత్వ రంగ సంస్థలను అత్యంత చౌకగా, ఎడాపెడా ప్రైవేటీకరించటం తీవ్రమైంది. దీనికి అదనంగా ప్రైవేటు పెట్టుబడులు తగ్గాయి. మూలధన సాంద్రత పెరిగింది. ఉద్యోగ రహిత వృద్ధి, క్రమంగా ఉద్యోగాలను కోల్పోయే వృద్ధిగా పరిణమించింది. గ్రామీణ సమస్యలు, వ్యవసాయ రంగ సంక్షోభం, నిరుద్యోగిత, వేతనాల తగ్గుదల వల్ల సమిష్టి డిమాండ్ బాగా తగ్గింది. 1980-2000ల మధ్య కాలంలో స్థూల దేశీయోత్పత్తిలో ప్రైవేటు సంపద 290 శాతం వుండగా, ఆ తర్వాత 560 శాతానికి పెరిగింది. ఆర్థిక అసమానతలు తీవ్రం కావడంతో ఉపాంత వినియోగ ప్రవృత్తి అధికంగా వుండే శ్రామిక వర్గం నుండి ఉపాంత వినియోగ ప్రవృత్తి స్వల్పంగా వుండే సంపన్న వర్గానికి ఆదాయాలు, సంపద బదిలీ కావడంతో సమిష్టి డిమాండ్ తీవ్రంగా తగ్గింది.

అసలు సమస్యను గుర్తించడానికి నిరాకరిస్తూ, సరఫరా గొలుసును బలోపేతం చేయటం కోసం చర్యలు తీసుకోవడం వల్ల 2021-22 నాటికి భారతదేశంలో మాంద్యం స్థిరపడింది. అది స్తబ్దతతో కూడిన ధరల పెరుగుదల. 2021-22లో పప్పు ధాన్యాల ధరలు పెరిగాయి. ఆహార, ఇతర వస్తువుల ధరలు, ముఖ్యంగా ఆరోగ్య సేవల ధరలు పెరుగుతున్నాయి. కార్పొరేట్ పన్నులను 2019లో 22 శాతానికి తగ్గించడంతో 1.45 లక్షల కోట్ల రూపాయల రాబడిని ప్రభుత్వం కోల్పోయింది. గ్లోబల్ చమురు ధరలతో సంబంధం లేకుండా పెట్రోల్, డీజిల్, వంటగ్యాసుల మీద పన్నులను ప్రభుత్వం పెంచుతూనే వున్నది. అందువల్ల దేశీయ వస్తువుల ధరలు పెరుగుతూనే వున్నాయి. ఆ పెరుగుదల శాశ్వత ధోరణిని తీసుకుంటున్నది. తక్కువ స్థాయి తలసరి ఆదాయాలతో పాటు ధరల పెరుగుదల తీవ్రత వల్ల కుటుంబ పొదుపు తీవ్రంగా తగ్గింది. దీనితో విదేశీ పెట్టుబడుల మీద ఆధారపడటం ఇంకా తీవ్రమైంది.

నేషనల్ స్టాటిస్టిక్స్ ఆర్గనైజేషన్ అంచనా ప్రకారం 2021-22లో మన వృద్ధిరేటు 9.2 శాతంగా వుంది. ఇది పూర్తిగా వక్రీకరించిన వృద్ధిరేటు. ద్రవ్యోల్బణం తీవ్రతను పరిగణించ లేదు. వాస్తవ స్థూల దేశీయోత్పత్తిలో వృద్ధిరేటు రుణాత్మకంగా -7.9 శాతం వున్నది. ఐఎంఎఫ్ అంచనాల ప్రకారం 2022-23 లో ఉత్పత్తిలో తగ్గుదల 6.7 శాతం, 2023-24లో 4.1 శాతం. 2004-08 మధ్యకాలంలో సగటున మూలధన సంచయనంలో వృద్ధి 15 శాతం వుండగా, 2014-19లో 5.8 శాతానికి తగ్గింది. ఆర్‌బిఐ, 2013 అంచనాల ప్రకారం వాస్తవ వడ్డీ రేటు తక్కువగా వున్నప్పటికీ ప్రైవేటు పెట్టుబడులు పెరగలేదు. ఎగుమతుల-ఆధారిత వృద్ధి వ్యూహం అన్నారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల సంస్కరణలు అనేక రంగాలలో 100 శాతం, ఆటోమేటిక్ రూట్ ద్వారా ప్రవేశించడానికి అనుమతులనిచ్చారు. పన్ను రాయితీలు, ప్రోత్సాహకాలను కల్పించారు. అయినా ఈ పెట్టుబడులు తయారీ రంగం దిశగా వెళ్లలేదు. సేవల రంగానికి, ముఖ్యంగా శీఘ్రంగా అధిక లాభాలనిచ్చే ఐటి రంగానికి తరలి వెళ్లాయి.

విదేశీ పెట్టుబడుల వల్ల కొత్త సాంకేతికత రాలేదు. అవి బ్రౌన్ ఫీల్డ్ ప్రాజెక్టులలోకి ప్రవేశించాయి. దేశీయ కంపెనీలను వెళ్ళగొట్టాయి. విదేశీ కంపెనీల ఎగుమతుల సాంద్రత రుణాత్మకంగా వుంది. దిగుమతుల సాంద్రత తీవ్రంగా వున్నది. 2014లో ప్రవేశపెట్టిన 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమం వల్ల తయారీ రంగం వృద్ధిరేటు పెరగలేదు సరి కదా, తగ్గింది. ఉద్యోగ కల్పన లేదు. ఎగుమతులలో దేశీయ ఉత్పత్తుల వాటా తగ్గింది. దిగుమతుల వాటా పెరిగింది. గ్లోబల్ విలువ గొలుసులో తక్కువ స్థాయి విలువను జమ చేసే ఉత్పత్తులకే మనం పరిమితం అయినాము. స్థూల దేశీయోత్పత్తిలో ప్రభుత్వ రుణాలు 72.5 శాతంగా వున్నాయి. ప్రభుత్వ పన్ను రాబడిలో 32 శాతాన్ని కేవలం వడ్డీ చెల్లింపులకే వెచ్చిస్తున్నారు. విదేశీ పెట్టుబడుల మీద ఆధారపడిన మన వ్యవస్థలో అభివృద్ధి అస్థిరంగా వుంది. స్వావలంబన వుండదు. అధీనత్వం పెరుగుతోంది. దీనికి తోడు రూపాయి విలువ తగ్గుతూనే వున్నది. విదేశీ మారక ద్రవ్య చెల్లింపులలో ప్రత్యేకించి కరెంట్ అకౌంట్‌లో లోటు రోజురోజుకీ పెరుగుతూనే వున్నది. దిగుమతుల మీద ఆధారపడటం పెరగటం వల్ల డాలర్లకు డిమాండ్ పెరుగుతుంది. జనవరి 2022లో వాణిజ్య లోటు 17.3 బిలియన్ల డాలర్లు వుండగా, కేవలం ఆరు

నెలల్లో జూన్ 2022 నాటికి ఈ లోటు 25.6 బిలియన్ డాలర్లకు పెరిగింది. ఈ పరిస్థితులలో విదేశీ వాణిజ్య విధానం-2023, 2030 నాటికి 2 ట్రిలియన్ డాలర్ల ఎగుమతులను సాధించడం లక్ష్యం అని ప్రకటించటం వైరుధ్యమే.

ప్రజలందరికీ గౌరవప్రదమైన ఉపాధులను కల్పించినప్పుడే సమ్మిళిత వృద్ధి సాధ్యమవుతుంది. సమిష్టి డిమాండు సంక్షోభాన్ని పరిష్కరించవచ్చు. పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థ ఆర్థిక మాంద్యాన్ని, సంక్షోభాన్ని మాత్రమే సృష్టిస్తుంది. అయితే, ప్రపంచాన్ని గడగడలాడించిన 1930ల ప్రపంచ ఆర్థిక మాంద్యం, పురిటి దశలోనే సోషలిస్టు వ్యవస్థగా వున్న సోవియట్ యూనియన్‌ని తాకలేకపోయింది. అదేవిధంగా ప్రస్తుతం ముంచుకొస్తున్న ప్రపంచ ఆర్థిక మాంద్యం చైనా, రష్యాల మీద ఎక్కువ ప్రభావం చూపెట్టలేకపోతున్నది. ఈ రెండు దేశాలు ఇప్పుడు సోషలిస్టు వ్యవస్థలు కావు. సోషలిస్టు వ్యవస్థ పునాదులపై కొనసాగుతున్న మార్కెట్ ఆధారిత ఆర్థిక వ్యవస్థలు మాత్రమే. సంక్షోభాలు లేకుండా సాగే ఆర్థిక వ్యవస్థల నిర్మాణాలు సోషలిస్టు వ్యవస్థలోనే సాధ్యమని స్పష్టమవుతున్నది. ఆ దిశగా పోరాటాలను ముమ్మరం చేయటమే విప్లవ శక్తుల ముందున్న అతిపెద్ద ఛాలెంజ్.

**(ఏప్రిల్ 2024 'క్లాస్‌స్ట్రగుల్' నుండి**
**ప్రొ॥ తోట జ్యోతిరాణిగారి వ్యాసానికి అనువాదం)**

* * * * *